క్లుప్తంగా

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

రోలుగుంట: మహా శివరాత్రోత్సవాలు పురస్కరించుకుని బుచ్చింపేటలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. నర్సీపట్నం, రోలుగుంట, తదితర మండలాల నుంచి 30 జట్లు పాల్గొన్నాయి. తొలిరోజు గబ్బాడ, బుచ్చింపేట జట్లు పోటీపడ్డాయి. ఆలయాభివృద్ధికి, అన్నసమారాధనకు భక్తులు సాయం చేయాలని నిర్వాహకులు కోరారు. 9550610503, 9493960276, 9848656337 సంప్రదించాలన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

మాకవరపాలెం: అక్రమంగా లేఅవుట్లు వేస్తే చర్యలు తప్పవని ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి హెచ్చరించారు. పైడిపాల రెవెన్యూలోని 699, 709 సర్వే నంబర్లలో అనుమతులు లేకుండా లేఅవుట్లు వేశారు. వీటిని గుర్తించిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు గురువారం అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ ఈ లేఅవుట్లో ఎవరైనా స్థలాలు కొనుగోలు చేసినా చెల్లదని స్పష్టం చేశారు.

ఘనంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవం



ఆలయంలో భజనలు చేస్తున్న భక్తులు

నాతవరం: మర్రిపాలెం పంచాయతీ శివారు వెన్నలపాలెంలో ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు నుంచే ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. పది గ్రామాలకు చెందిన భజన భక్తులతో 24 గంటలపాటు భజనలు చేస్తున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఘనంగా నల్లమారమ్మ జాతర



ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

మాకవరపాలెం: కొండల అగ్రహారంలో నల్లమారమ్మతల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు గురువారం ఉదయం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమరావతి ట్రావెల్స్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యుడు గూడూరు వెంకటరాజు, సర్పంచ్ పోలిరెడ్డి అచ్చియ్యమ్మ, చిటికెల రమణ, పోలిరెడ్డి రమణ పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

బుచ్చెయ్యపేట: లోపూడిలో నిరుపేదలకు వడ్డాదికి చెందిన అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఆరిపాక కామేశ్వరరావు దుస్తులు పంపిణీ చేశారు. గురువారం శ్రీకృష్ణదేవరాయలు జయంతి సందర్భంగా ఆయన వంద మంది పేదలకు, చిన్నారులకు వీటిని అందించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

తీర్థం పోస్టర్ విడుదల

మాడుగుల: స్థానిక మామిడివారి కళ్లాల వద్ద ఈ నెల 18న జరగనున్న పోతురాజుబాబు తీర్థం పోస్టర్‌ను గురువారం తారువ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు విడుదల చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మామిడి సత్తిబాబు, కర్రి బుజ్జి, మామిడి, శ్రీను, ఉగ్గిన శ్రీను పాల్గొన్నారు.

20న సర్వసభ్య సమావేశం

దేవరాపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 20న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

శివ పూజకు సర్వం సిద్ధం

- ముస్తాబైన శైవక్షేత్రాలు
- అన్నసమారాధన, సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు



రోలుగుంట: రంగులతో తీర్చిదిద్దిన పార్వతీపరమేశ్వరులు



గొలుగొండ: ముస్తాబైన దారమఠం శివాలయం



నాతవరం: జిల్లేడుపూడిలో 30 అడుగుల నాగసర్ప శివలింగం

గొలుగొండ: ప్రముఖ శైవక్షేత్రమైన దారమఠం శివాలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. రంగులు వేయడంతోపాటు దారమఠం ప్రాంగణం అంతా శుభ్రం చేయించారు. దారమఠం నుంచి గొలుగొండ వరకు రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్సు చేయించారు. శని, ఆది వారాల్లో భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున దేవదాయ శాఖ, పోలీస్, కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సీపట్నం నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడపనున్నారు.

ఎం. కోడూరు శివాలయం వద్ద శివపార్వతుల కల్యాణం

మాడుగుల రూరల్: మహా శివరాత్రి ఉత్సవాలకు కె.జె.పురం శివాలయం సర్వం సిద్ధమైంది. ఈ నెల 18న జిల్లా స్థాయి కబడ్డీ, సైకిల్ స్పీడు, ముగ్గులు పోటీలు నిర్వహించనున్నట్లు గౌరీ పరమేశ్వర భజన సేవా బృందం సభ్యులు తెలిపారు. సామూహిక దీపార్చన, ఐదు వేల మంది భక్తులకు చద్ది ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వి.వి.అగ్రహారం, జంపెన, ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాలతోపాటు వి.జె.పురం, పిట్టగెడ్డ, వీరనారాయణం, తదితర శివాలయాలను విద్యుద్దీపాలంకరణ ముస్తాబు చేశారు.

ప్రత్యేక పూజలు, అభిషేకాలకు ఏర్పాట్లు

దేవరాపల్లి: మండలంలోని శారదా నదికి ఆనుకున్న తిమిరాం ఉమామహేశ్వర స్వామి ఆలయంతోపాటు బోయిలకింతాడ, వేచలం, ఎం. అలమండ, పెదనందిపల్లి, చిననందిపల్లి శివాలయాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బుచ్చింపేటలో మినీ కైలాసగిరి వద్ద...

రోలుగుంట: బుచ్చింపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గంలో కొండపైన మినీ కైలాసగిరిగా భాసిల్లుతున్న శివపార్వతులను నిర్వాహకులు రంగులతో తీర్చిదిద్దారు. శనివారం మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం దీపారాధన, బాణసంచా కాల్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రోలుగుంట కొండల నడుమ కోనేరు వద్ద వెలసిన కాశీవిశ్వేశ్వర మృత్యుంజయ ఆలయం, నిండుగొండలో శివాలయం ముస్తాబయ్యాయి.

చిక్కుడుపాలెం భూగర్భ శివాలయంలో 360 శివలింగాల ప్రతిష్ఠకు ఏర్పాట్లు

నాతవరం: చిక్కుడుపాలెంలో అతి పెద్ద భూగర్భ శివాలయంలో మహా శివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజున 360 శివలింగాలు ప్రతిష్ఠించనున్నారు. స్వయంభూ శివలింగంతోపాటు ద్వాదశ జ్యోతిర్లింగాలు, అర్ధనారీశ్వరి శివలింగం, పార్వతీపరమేశ్వర్లు శివలింగం, పదివేల రుద్రాక్షలతో కూడిన శివలింగం, పంచముఖ శివలింగం ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వి.బి.అగ్రహారంలో పురాతన రామలింగేశ్వరస్వామి ఆలయంలో 750 ఏళ్ల క్రితం కాశీ నుంచి ఎడ్ల బండిపై తీసుకొచ్చి శివలింగం ప్రతిష్ఠించినట్లుగా పూర్వీకులు చెబుతుంటారు. జిల్లేడుపూడిలో 30 అడుగుల ఎత్తయిన నాగసర్ప శివలింగం సిద్ధమైంది.



నాతవరం: భూగర్భ శివాలయంలో ప్రతిష్ఠించేందుకు సిద్ధం చేసిన శివలింగాలు



మాడుగుల రూరల్: కె.జె.పురం శివాలయం వద్ద గోడపత్రికను విడుదల చేస్తున్న భక్త బృందం



దేవరాపల్లి: తిమిరాం ఉమామహేశ్వరి స్వామి ఆలయం

తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయండి

- అధికారులతో నర్సీపట్నం ఆర్డీవో జయరాం సమీక్ష



రిజర్వాయర్‌లో స్నానాల రేవును పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

రావికమతం: కల్యాణపులోవ తిరునాళ్లను విజయవంతం చేయాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం ఆదేశించారు. కల్యాణపులోవలో ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు జరిగే తిరునాళ్లకు రోజుకు లక్షకుపైగా యాత్రికులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు స్నానాల రేవులో గజ ఈతగాళ్లను, ఫైర్ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. డ్యామ్‌పైకి వెళ్లకుండా రక్షణ కంచె, యాత్రికులకు తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఎప్పటికపుడు చెత్తను తొలగించాలన్నారు. తిరునాళ్లు పూర్తయ్యే వరకూ ఎవ్వరూ సెలవులు పెట్టవద్దని సూచించారు. తహసీల్దార్ మహేశ్వరరావు, కొత్తకోట సీఐ మహమ్మద్, ఎంపీడీవో వెంకన్నబాబు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, సర్పంచ్ ఒంజరి గంగరాజు, ట్రస్టు బోర్డు చైర్మన్ పాడి పోతురాజు, ఎస్ఐ విభీషణరావు పాల్గొన్నారు.

చిరుధాన్యాల పంటలతో అదనపు ఆదాయం

- జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టరు ఆశాదేవి



కె.జె.పురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆత్మ పీడీ ఆశాదేవి

మాడుగుల రూరల్: రైతులు చిరుధాన్యాల పంటలు పండించి అదనపు ఆదాయం సంపాదించుకోవాలని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) జిల్లా ప్రాజెక్టు డైరెక్టరు ఎం. ఆశాదేవి సూచించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా గురువారం కె.జె.పురం సూరిశెట్టి గోవిందరాజు కళ్లాల వద్ద చిరుధాన్యాల ఉపయోగం, వాటి ఆవశ్యకతపై ఆమె అవగాహన కల్పించారు. ఈ ఏడాది అంతర్జాతీయ చిరుధాన్యాలు సంవత్సరంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. వీటిని వినియోగం వల్ల ఎటువంటి వ్యాధులు దరిచేరవన్నారు. వరి పంటకు బదులు ప్రతి రైతు చిరుధాన్యాలు పండించుకోవడం ద్వారా ఇటు ఆదాయం పెంచుకోవడంతోపాటు అటు మనకు మంచి ఆరోగ్యం ఇస్తుందన్నారు. జిల్లా రిసోర్సు శిక్షణ కేంద్రం సమన్వయకర్త టి. దాసు మాట్లాడుతూ ఫాస్ట్‌ఫుడ్స్ వల్ల ఒరిగిందేమి లేదన్నారు. అనంతరం కె.జె.పురం - ఎం. కోటపాడు గ్రామాల మధ్య బాలోజు పొలంలో మినప పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. సేంద్రియ విధానంలో నీమాస్త్రం తయారీని రైతులకు చూపించారు. ఆరుతడి పంటలతో భూమి సారవంతంగా మారుతుందని నర్సీపట్నం డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు వి. మోహన్‌రావు సూచించారు. ఏవో ఎం.వాసుదేవరావు, జిల్లా రిసోర్సు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారులు విజేత, తులసీమణి, సర్పంచ్ జామి రమణబాబు, ప్రకృతి వ్యవసాయం మండల ఎంకర్ గండి శ్రీనివాసరావు, వీఏఏలు, వీహెచ్ఏలు, ఆత్మ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

దేవరాపల్లి: వేచలం జెడ్పీ హైస్కూల్‌లోని టెన్త్ విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు, పూర్వ విద్యార్థులు, స్థానిక హెచ్ఎం డి. నర్సింహమూర్తి సమక్షంలో వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళిక బద్ధంగా చదివి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. సూరెడ్డి బాబూరావు, రెడ్డి శేషగిరిరావు మాస్టార్లు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ట్రస్టు సభ్యులు లెక్కల సత్యనారాయణ, సిహెచ్. నాగేష్, వేచలపు వంశీ పాల్గొన్నారు.

ఎ.కోడూరులో..

కె.కోటపాడు: చదువులతోనే ఉన్నత ఉద్యోగావకాశాలను పొందగలరని హెచ్ఎం అనురాధ సూచించారు. ఎ.కోడూరు హైస్కూల్‌లో 91 మంది పదో తరగతి విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను గురువారం ఆమె పంపిణీ చేశారు. లెక్కల ఎరుకునాయుడు, లెక్కల కోటి, పీఎంసీ కమిటీ చైర్మన్ అర్జున, అప్పికొండ బసవరాజు పాల్గొన్నారు.

గృహసారథులు, కన్వీనర్లు సమన్వయంతో పని చేయండి

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



పేట సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందేలా గృహ సారథులు, కన్వీనర్లు కృషి చేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. గురువారం విజయరామరాజుపేట, బుచ్చెయ్యపేటలో 35 పంచాయతీ గ్రామాల గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో గృహ సారథులను, సచివాలయ కన్వీనర్లు, మండల కన్వీనర్లను నియమించామన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందాలన్నదే సీఎం ఆశయమన్నారు. ప్రతి 25 కుటుంబాలకు ఒక గృహ సారథిని నియమించామన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకోవాలన్నారు. అందకపోతే వారికి పథకాలు అందే బాధ్యతను గృహసారథులు, కన్వీనర్లు తీసుకోవాలన్నారు. ఇప్పటికే సీఎం 98.5 శాతం హామీలను నెరవేర్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వైఎస్సార్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి పంచాయతీకి రూ.10 కోట్లు చొప్పున సంక్షేమ పథకాలు ద్వారా ప్రజలకు అందించారన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంప చినబాబు, బీసీ సంఘం డైరెక్టర్లు జొన్నాడ శ్రీనివాసరావు, చిత్రాడ జగదీష్, సర్పంచ్ ఎల్లపు విజయ్‌కుమార్, కోఆపరేటివ్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, ఎల్లపు గోవింద పాల్గొన్నారు.

6 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులకు పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

మాకవరపాలెం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని బూరుగుపాలెం-తూటిపాల గ్రామాల మధ్య జాజిగెడ్డ నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో గురువారం ఎస్ఐ రామకృష్ణారావు తమ సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఆరు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన నేపథ్యంలో ఒక్కో ట్రాక్టరుకు రూ.10 వేలు పెనాల్టీ విధించామన్నారు.

ఉత్సాహంగా ఎడ్లబళ్ల పరుగు పోటీలు



ఎడ్ల బళ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు

రావికమతం: స్థానిక భక్తాంజనేయ స్వామి ఆలయ తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎడ్లబళ్ల పరుగు పోటీల్లో 15 గ్రామాల నుంచి 16 బళ్లు పాల్గొన్నాయి. ఇందులో మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన కె.ఎల్.వి.పట్నం, కె.జె.పురం, నర్సయ్యపేట, కె.ఎల్.వి.పట్నం, కె.జె.పురం, గుడ్డిప గ్రామాల ఎడ్లబళ్లకు ఉత్సవ కమిటీ సభ్యులు నగదు బహుమతులు ప్రదానం చేశారు.

రోడ్లపై చెత్త వేస్తే అపరాధ రుసుం



కె.జె.పురంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాగలక్ష్మి తదితర్లు

మాడుగుల రూరల్: రోడ్ల మీద చెత్త వేస్తే అపరాధ రుసుం విధించాలని చెత్త నుంచి సంపద కేంద్రాల జిల్లా సమన్వయకర్త కె. నాగలక్ష్మి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆమె కె.జె.పురం, వి.వి. అగ్రహారం, జి. అగ్రహారం, ముకుందపురం గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా తడి, పొడి చెత్తను ఇంటింటికి వెళ్లి సేకరించి, చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు. అక్కడ వర్మీ కంపోస్టును తయారు చేయించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించేటట్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో మీనాకుమారి, పంచాయతీ కార్యదర్శులు పెంకి శివ, సింహాచలం, నాగేశ్వరావు, రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు 2 పోలింగ్ కేంద్రాలు

కె.కోటపాడు: మార్చి 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికకు స్థానిక హైస్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ జె.రమేష్‌బాబు గురువారం తెలిపారు. ఈ రెండు పోలింగ్ కేంద్రాల్లో మండలానికి చెందిన పట్టభద్రులు ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఇప్పటికే పోలింగ్ నిర్వహణకు అన్ని వసతులతో రెండు తరగతి గదులను సిద్ధం చేశామన్నారు. పోలింగ్ ప్రక్రియ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు.

580 జీవాలకు పీపీఆర్ నిరోధక టీకాలు

మాడుగుల: జాలంపల్లి పంచాయతీ మేడవీధి, రావిపాలెం, గొప్పూరు, అవురువాడ పంచాయతీ తుమ్మవానిపాలెం, శంకరం పంచాయతీలో 580 జీవాలకు పీపీఆర్ నిరోధక టీకాలు వేసినట్లు ప్రాంతీయ పశువైద్య శాఖ సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు గురువారం తెలిపారు. ఇంతవరకు మండలంలో 6,295 జీవాలకు పీపీఆర్ నిరోధక టీకాలు వేశామన్నారు.

రోలుగుంట ఆర్ఐగా రామమూర్తి



రోలుగుంట: ఆర్ఐగా టి.రామమూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్ఐగా పని చేసిన సత్యనారాయణ డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతిపై గతేగాది డిసెంబర్ 10న ఇక్కడ నుంచి నర్సీపట్నం బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఈ పోస్టు రామమూర్తితో భర్తీ అయింది. అచ్యుతాపురం ఆర్ఐగా పని చేస్తున్న ఆయన ఇక్కడకు బదిలీపై విధుల్లో చేరారు.

ఉపాధ్యాయిని మృతికి సంతాపం



నర్సీపట్నం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల(మెయిన్)లో తెలుగు పండిట్‌గా పని చేస్తున్న ఐ.పి.ఎల్.సత్యవాణి విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఐదు రోజుల కిందట ఆమెకు హఠాత్తుగా ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రిలో చేరారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయని ఆకస్మిక మరణంతో సహచర ఉపాధ్యాయులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 30 ఏళ్లకు పైగా నర్సీపట్నం, నాతవరం ఉపాధ్యాయ వృత్తిలో ఆమె విశేష సేవలు అందించారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు భీమరాజు



కార్యదర్శి ప్రసాద్

కె.కోటపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా ఎస్.రాము నాయుడు, అధ్యక్షుడిగా కె.భీమరాజు, ప్రధాన కార్యదర్శిగా వి.ప్రసాద్, ఉపాధ్యక్షురాలిగా భాగ్యశ్రీ, జాయింట్ సెక్రటరీగా వై.అనురాధ, ట్రెజరర్‌గా ప్రవీణ, కన్వీనర్‌గా రమేష్ ఎన్నికయ్యారు.

వృద్ధురాలికి ఆశ్రయం

మురళీనగర్: నర్సీపట్నం సమీపంలోని కృష్ణదేవిపేట నుంచి వచ్చి నగరంలోని కేజీహెచ్ ప్రాంతంలో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఒక వృద్ధురాలికి పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమ నిర్వాహకుడు, మేనేజింగ్ ట్రస్టీ రొబ్బి శ్రీనివాసరావు గురువారం ఆశ్రయం కల్పించారు. వడ్డాది సత్తెమ్మ(77) పెరాలసిస్‌తో బాధపడుతోంది. ఆమె ఇద్దరు కొడుకులు చనిపోయారు. మనవడు ఉన్నప్పటికీ ఆమెకు అందుబాటులో లేడు. కేజీహెచ్ ప్రాంత వాసులు ఇచ్చిన సమాచారం మేరకు సత్తెమ్మను తీసుకుని వచ్చి ఆశ్రయం కల్పించారు.

80 మంది రోగులకు వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న ఆప్తాలమిస్ట్ రాజశేఖర్

రోలుగుంట: స్థానిక సురక్ష నర్సింగ్ హోమ్ వద్ద గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన 80 మంది రోగులకు సుగర్, బీపీ టెస్ట్‌లను ఆప్తాలమిస్ట్ రాజశేఖర్ చేశారు. ఏఎన్ఎం మంగలక్ష్మి అవసరమైన సేవలందించారు. రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలను నిర్వాహకుడు సతీష్ కల్పించారు.

కొరువాడలో 167 మందికి వైద్య సేవలు

కె.కోటపాడు: ఫ్యామిలీ ఫిజిషియన్‌లో భాగంగా కొరువాడలో గురువారం లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి జాహ్నవి 167 మందికి వైద్య సేవలందించారు. మందులను ఉచితంగా ఇచ్చారు. 13 ఇళ్లకు వెళ్లి అచేతన రోగులకు, ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి తిలక్, వైద్య సిబ్బంది రమణ పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రణాళికతో మెరుగైన బోధన



విడివిడిగా విద్యార్థులను ప్రశ్నిస్తున్న పరిశీలక బృందం

చోడవరం రూరల్: ప్రతీ విద్యార్థి అభ్యసనా స్థాయిల్ని మెరుగు పరచడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసి బోధించాలని రాష్ట్ర అభ్యసనాభివృద్ధి కార్యక్రమం ప్రత్యేకాధికారి జి.జి.ఎస్.నాగేశ్వరరావు సూచించారు. గురువారం లక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలను లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్) రాష్ట్ర పరిశీలక బృందం సందర్శించింది. ఈ బృందం ప్రత్యేకాధికారి, భీమునిపట్నం డైట్ లెక్చరర్ నాగేశ్వరరావు బృందం విద్యార్థులను 6, 7, 8 తరగతుల వారీగా పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు సంధించి, వారి నోట్స్ పుస్తకాలను పరిశీలించి వారి అభ్యసనాశక్తిని అంచనా వేసింది. విద్యార్థులు ఇచ్చిన సమాధానాలకు సంతృప్తి చెందింది. పాఠశాలలో చిన్నారి డాక్టర్, ఓపెన్ లైబ్రరీ కార్యక్రమాలు, విద్యార్థులతో ఉపాధ్యాయులు తయారు చేసిన క్రాఫ్ట్ మోడల్స్‌ను ఆసక్తిగా తిలకించిన ఉపాధ్యాయుల కృషిని అభినందించింది. స్టేట్ రిసోర్స్ పర్సన్లు వి.వి.ఎస్.నాగలక్ష్మి, ఎన్.డేవిడ్‌రాజు, జిల్లా నోడల్ అధికారి ఆర్.వి. గిరి ఉన్నారు. ప్రధానోపాధ్యాయుడు వి.వి.శేషగిరిరావు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చీడికాడ: మండలంలోని జేబీపురం, వరహాపురం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయాధికారి ఐసీఆర్‌పీస్ ఎం.టి నాగమణి మాట్లాడుతూ ప్రకృతి సాగుతో ఆరోగ్యకరమైన పంటలు పొందవచ్చన్నారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి సాగు కోసం రైతులను ప్రోత్సహిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.